క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన ఎంపీపీ వండ్రయ్య



సమస్యలపై ఎంపీడీఓతో చర్చిస్తున్న ఎంపీపీ వండ్రయ్య

కణేకల్లు: కణేకల్లు నూతన ఎంపీపీగా వండ్రయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. తన చాంబర్‌లో మండల ప్రజాపరిషత్ మినిట్స్ బుక్‌లో ఎంపీడీఓ శ్రీనివాసులు సమక్షంలో సంతకం చేసి, బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీపీ, ఎంపీడీఓ కలిసి కార్యాలయ సిబ్బందితో సమావేశమై వివిధ సమస్యలపై చర్చించారు. మండలాభివృద్ధితో పాటు ప్రజా సమస్యల విషయంలో కోసం రాజకీయాలకు అతీతంగా సమన్వయం చేసుకుంటూ పనిచేయడానికి తాను సిద్ధమన్నారు. అధికారులు కూడా నిష్పక్షపాతంగా పనులు చేయాలన్నారు. ఎంపీపీ వండ్రయ్యకు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, నాయకులు ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి శుభాకాంక్షలు చెప్పారు.

సైన్స్ ఎక్స్‌పోలో కోనంపల్లి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ మల్లారెడ్డి

బొమ్మనహాళ్: మండలంలోని కోనంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి పది మంది విద్యార్థులు సైన్స్ ఎక్స్‌పోకు ఎంపికయ్యారని ఎంఈఓ మల్లారెడ్డి తెలిపారు. సోమవారం కోనంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ పరిశీలించారు. పాఠశాలలో 2023-24లో సైన్స్‌ఫేర్‌కు ముగ్గురు విద్యార్థులు, 2024-25లో ముగ్గురు, 2024-25 సౌత్ ఇండియా సైన్స్‌ఫేర్‌కు ఇద్దరు, 2024-25లో నేషనల్ సైన్స్ కాంపిటీషన్స్‌కు జిల్లా స్థాయిలో ఇద్దరు విద్యార్థులు మొత్తం 10 మంది ఇప్పటి వరకు సైన్స్ ఎక్స్‌పోకు ఎంపికయ్యారని హెచ్‌ఎం సూర్యనారాయణ, సైన్స్ ఉపాధ్యాయిని సుధామాధవి తెలిపారు.

'శ్రీరామరెడ్డి' కార్మికులకు వేతనాలు ఇప్పించండి



ఆర్డీఓకు సమస్య విన్నవిస్తున్న సీఐటీయూ నాయకులు

కళ్యాణదుర్గం: శ్రీరామిరెడ్డి పథకం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇప్పించాలని సీఐటీయూ నాయకులు ఆర్డీఓ వసంతబాబును కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీరామరెడ్డి పథకం కార్మికులకు గత 6 నెలల వేతనాలు అందించాల్సి ఉందన్నారు. 30 నెలల పీఎఫ్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్పందించిన ఆర్డీఓ సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పలు సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆర్డీఓ స్వీకరించారు.

హనుమాన్ విగ్రహానికి షెల్టర్ ఏర్పాటు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ ఎదురుగా వీహెచ్‌పీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో శాశ్వత కట్ట ఏర్పాటు చేసి ప్రతిష్ఠించిన భజరంగీ హనుమాన్ విగ్రహానికి షెల్టర్ ఏర్పాటు చేశారు. వాల్మీకి సంక్షేమ సేవా సమితి ఉపాధ్యక్షుడు మల్కన్న షెల్టర్ ఏర్పాటు చేశారు. దాతలు స్వామికి గోపురం నిర్మాణానికి కృషి చేయాలని వీహెచ్‌పీ అధ్యక్షుడు రాజేష్ కోరారు.

ఒలింపియాడ్‌లో ఎస్‌ఎల్‌వీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కళాశాల యాజమాన్యం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఎస్‌ఎల్‌వీ విద్యాలయంలో ఇంగ్లిష్, సైన్స్, గణితం సబ్జెక్టులపై ఒలింపియాడ్ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. విద్యార్థులకు రూ.20 వేలు చెక్కు, సర్టిఫికెట్లు విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఫణి, శ్రీకాంత్‌రెడ్డి, విజయభాస్కర్, కిశోర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీమా..ఏదీ ధీమా!

- పేరుకుపోతున్న పెండింగ్ క్లెయిమ్‌లు
- 2024 మార్చి తర్వాత అమల్లోకి రాని పథకం
- 13 నెలలుగా ఎదురుచూపులకే పరిమితం
- ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్భాటంగా ప్రకటన
- అధికారం చేపట్టి పది నెలలైనా అతీగతీలేదు



రాయదుర్గం: సంక్షేమ పథకాల అమలును గాలికొదిలిన కూటమి సర్కారు.. కనీసం బీమా పథకమైనా అమలు చేస్తే కాస్త భరోసా ఉంటుందని ప్రజలు అంటున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నన్నాళ్లూ 'వైఎస్సార్ బీమా'ను అమలు చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి పేదోడికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయం అందించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నేరుగా బాధితుల ఇళ్ల వద్దకే వెళ్లి సీఎం సహాయ నిధి పరిహారం అందించారు. సవ్యంగా సాగుతున్న ఈ పథకం.. సార్వత్రిక ఎన్నికల తర్వాత ఆగమేఘాలపై చంద్రన్న బీమాగా మార్చి వదిలేశారు. దీంతో సహజ మరణంతో పాటు ప్రమాదవశాత్తూ మరణించిన కుటుంబాలు గత పది నెలలుగా పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. అసలు బీమా పథకం ఇస్తారా? లేక ఎత్తేస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఏఏవై 16,745, తెల్ల రేషన్‌కార్డులు 1,84,770 మొత్తం 2,01,515 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీరంతా దారిద్య్రరేఖకు దిగువగా ఉన్నవారు. ఏఏవై, తెల్ల రేషన్ కార్డులు కలిగిన వారంతా బీమా పథకానికి అర్హులు. ప్రమాదవశాత్తూ ఏదో ఒక రూపంగా మృత్యువు నిత్యం కబళిస్తూనే ఉంది. అయితే ఆదుకోవాల్సిన బీమా పథకం అమలు చేస్తారో? లేదో తెలియడంలేదు.

రూ.10 లక్షలు ఇస్తామన్నారు

బీమా పథకాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తాం.. అర్హులందరికీ న్యాయం చేస్తాం.. వైఎస్సార్‌సీపీ హయాంలో కంటే రెట్టింపు సాయం అందిస్తాం.. సహజ మరణానికైతే రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలు ఇస్తామంటూ కూటమి నాయకులు ఎన్నికలప్పుడు ఊరూరా ఊదరగొట్టారు. ఎన్నికల మేనిఫెస్టోలోనూ ముద్రించి ఇంటింటా పంపిణీ చేశారు. అధికారం చేపట్టాక వక్రబుద్ధి చూపుతున్నారు. 2024 మే 13 నుంచి బీమా పథకాన్ని వెబ్‌సైట్ నుంచి తొలగించారు. తర్వాత నమోదుకు అవకాశం కల్పించలేదు. అప్పటి నుంచి ఎన్నో కుటుంబాలు రోడ్డు పాలైనా సీఎం రిలీఫ్ ఫండ్ కోసం వేచి చూడాల్సి వస్తోంది.



మార్గదర్శకాలు రావాలి

సాధారణ, ప్రమాదవశాత్తూ మరణాలు ఏవి జరిగినా గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదవుతున్నాయి. అయితే ప్రభుత్వం నుంచి బీమా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు వెలువడలేదు. స్పష్టమైన మార్గదర్శకాలు అమలులోకి రాగానే పెండింగ్ క్లెయిమ్‌లతో పాటు కొత్త వాటికి న్యాయం జరిగేలా చూస్తాం. ప్రస్తుతం పీఎం జేజేబీవై, పీఎమ్ ఎస్‌బీవై పథకాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

– ఈశ్వరయ్య, డీఆర్‌డీఏ పీడీ, అనంతపురం

పరిహారం అందించాలి



ఆపద సమయాల్లో పేద కుటుంబాల్లో వెలుగులు నింపే బీమా పథకాన్ని కూటమి సర్కార్ వెంటనే అమలులోకి తీసుకురావాలి. వైఎస్సార్‌సీపీ హయాంలో బీమా పథకం ఎన్నో కుటుంబాలను ఆదుకుంది. సీఎం చంద్రబాబు దీనిపై నిర్లక్ష్యం చూపకుండా త్వరలో మార్గదర్శకాలు విడుదల చేయాలి. వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకురావాలి.

– శారద, కౌన్సిలర్, రాయదుర్గం

విషాదం నింపుతున్న ప్రమాదాలు



ఇటీవల మా బంధువుల అబ్బాయి విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. అదే బీమా పథకం ఉంటే రూ.10 లక్షల సాయం ఆ పేద కుటుంబానికి దక్కేది. వైఎస్సార్‌సీపీ హయాంలో వైఎస్సార్ బీమా పథకం ద్వారా ఎన్నో కుటుంబాలకు మేలు చేకూర్చాం. కూటమి ప్రభుత్వం కూడా ఇచ్చిన వాగ్దానం మేరకు సాధారణ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ అయితే రూ.10 లక్షల పరిహారం అందించి ఆదుకోవాలి.

– దిలవర్‌బాషా, వేపరాళ్ల

వైఎస్ జగన్ పర్యటన విజయవంతం చేద్దాం





మెట్టు గోవిందరెడ్డి , తలారి రంగయ్య

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి లో పర్యటిస్తున్నట్టు రాయదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల పరిటాల వర్గీయుల చేతిలో కురుబ లింగన్న దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్ పరామర్శించేందుకు వస్తున్నారని తెలిపారు.

కళ్యాణదుర్గం రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రామగిరి పర్యటన విజయవంతం చేద్దామని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం పాపిరెడ్డి పల్లిలో టీడీపీ వర్గీయుల చేతిలో దారుణ హత్యకు గురైన కురుబ లింగన్న కుటుంబాన్ని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పరామర్శించనున్నట్లు తెలిపారు. కళ్యాణదుర్గం నియోజవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఉదయం పాపిరెడ్డి పల్లికి చేరుకోవాలని రంగయ్య పిలుపునిచ్చారు.

బొమ్మనహాళ్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లిలో పర్యటించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధినేత పర్యటనను విజయవంతం చేద్దామని, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



ఆరోగ్య దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ మెర్సీ జ్ఞానసుధ

రాయదుర్గంటౌన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ మెర్సీ జ్ఞానసుధ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఐసీటీసీ విభాగం, మాస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఆస్పత్రి వద్ద సూపరింటెండెంట్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వినాయక సర్కిల్ వరకు ర్యాలీసాగింది. అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని భంభంస్వామి లేఅవుట్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు కెంచే లక్ష్మినారాయణ, ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి, ల్యాబ్ టెక్నీషియన్ అల్తాఫ్, ఏఎన్‌ఎంలు, మాస్ ఎడ్యుకేషన్ సిబ్బంది నాగమణి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దామని బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట పీహెచ్‌సీల వైద్యాధికారులు శ్రావణ్‌కుమార్, శ్రీలక్ష్మి, గీతాభార్గవి, కుమార రాజా తెలిపారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ గ్రామాల్లో అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్య పరిరక్షణకోసం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఆరోగ్య కార్యకర్తలు ,శశికల, నాగమణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సింహవాహనంపై జంబుకేశ్వరుడు దర్శనం



సింహ వాహనంపై ఊరేగుతున్న జంబుకేశ్వరుడు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన శ్రీస్వయంభూ జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, హాజరైన భక్తులకు తీర్థప్రసాదం అందించారు. అనంతరం సాయంత్రం స్వామివారి సింహ వాహనం కోట వీధుల మీదుగా వినాయక సర్కిల్, లక్ష్మీబజార్ వరకు ఊరేగించారు. అక్కడి నుంచి తిరిగి స్వామి వారి వాహనం ఆలయానికి చేరుకుంది. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి శేష వాహనోత్సవం జరుగుతుందని ఆలయ కార్య నిర్వహణాధికారి నరసింహారెడ్డి తెలిపారు. 10న కల్యాణోత్సవం, 12న స్వామి బ్రహ్మ రథోత్సవం జరుగుతుందన్నారు.

శేష వాహనంపై ఊరేగిన పార్వతీ పరమేశ్వరుడు



కూడేరు: శేష వాహనంపై పార్వతీ పరమేశ్వరులను ఊరేగిస్తున్న దృశ్యం

కూడేరు: స్థానిక పార్వతీ పరమేశ్వర స్వయంభు జోడు లింగాల సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి శేష వాహనంపై పార్వతీ పరమేశ్వరుడి ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి పీర్ల చావిడి వరకు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. రెడ్డి కులస్తులు, భక్తులు పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేయించారు. తొలుత సంగమేశ్వరస్వామి ఆలయం నుంచి పార్వతీ పరమేశ్వర ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ఊరేగింపుగా తీసుకొచ్చారు. కార్యక్రమంలో రెడ్డి కులస్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయ గోపురానికి నూతన శోభ

కూడేరు: ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల స్వయంభు జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం ముఖ ద్వారంపైన ఏర్పాటు చేసిన గాలి గోపురానికి నింబగల్లుకు చెందిన కోకా ప్రకాష్ రూ.లక్ష వెచ్చించి రంగులు వేయించాడు. దీంతో ఆలయ గోపురానికి నూతన శోభ వచ్చినట్లయ్యింది. ఈ నెల 12న సంగమేశ్వరుడి రథోత్సవం ఉందని , అందుకోసం సొంత ఖర్చులతో రంగులు వేయించి మొక్కు తీర్చుకున్నట్లు కోకా ప్రకాష్ తెలిపాడు.

12 నుంచి సంగమేశ్వరస్వామి ఉత్సవాలు





వేదావతి హగరి నది ఒడ్డున వెలసిన సంగమేశ్వరుడు , ఉత్సవాలకు ముస్తాబైన సంగమేశ్వరాలయం

బొమ్మనహాళ్: మండల పరిధిలో కర్ణాటక సరిహద్దున శింగానహళ్లి గ్రామ సమీపంలోని వేదావతి చిన్న, పెద్ద హగరి నదుల కలిసే కూడలిలో వెలసిన సంగమేశ్వరస్వామి ఉత్సవాలు ఈనెల 12 నుంచి ప్రారంభం కానున్నాయి. చోళుల కాలంలో రెండు నదులు కలిసే చోట ఒడ్డున ఆలయాన్ని నిర్మించారు. 13న ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు రథోత్సవం జరగనుంది. సంగమేశ్వరస్వామి ఆలయం నుంచి హగరి నది ఒడ్డున ఉన్న బసవన్న విగ్రహం వరకు అశేష జనవాహిని మధ్య రథాన్ని లాగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరు కానున్నారు.

సంగమేశ్వరస్వామి ఉత్సవ వివరాలు :

ఈనెల 12న వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు సంగమేశ్వరస్వామి విగ్రహాలను శింగానహళ్లి గ్రామం నుంచి ఊరేగింపుగా సంగమేశ్వరాలయానికి తీసుకొస్తారు. అదే రోజున ఉదయం 10 గంటలకు స్వామికి రుద్రాభిషేకం, ఆకుపూజ జరగనుంది. 12 గంటలకు సంగప్ప, సంగమ్మ కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటలకు శింగానహళ్లి నుంచి ఉత్సవ సామగ్రి ఊరేగింపుగా దేవస్థానం వద్దకు తీసుకొస్తారు. 13న సాయంత్రం 5.30 గంటలకు స్వామివారి రథోత్సవం జరగనుంది. 14,15,16 తేదీల్లో జాతర, రుద్రాభిషేకం, సంగమేశ్వర ఉత్సవ విగ్రహాలు శింగానహళ్లి గ్రామానికి చేర్చడం, టెంకాయల వేలం పాట జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

రమణీయం..రంగనాథ స్వామి రథోత్సవం



బ్రహ్మసముద్రం: రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



వజ్రకరూరు : గూళ్యపాళ్యంలో సీతారాముల రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : మండలంలోని వేపులపర్తి గ్రామంలో శ్రీలక్ష్మీ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం రమణీయంగా జరిగింది. ముందుగా ఆలయంలో స్వామికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలు డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి రథంలో ప్రతిష్ఠించారు. అనంతరం గోవింద నామ స్మరణతో వందలాది మంది భక్తుల మధ్య రథోత్సవం రమణీయంగా సాగింది.

అంగరంగ వైభవంగా సీతారాముల రథోత్సవం

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యంలో శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం సీతా రాముల రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్థానిక ధర్మప్ప దేవాలయంలో శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, ఆకుపూజ నిర్వహించారు. అనంతరం రథం ముందు హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి స్వామి ఉత్సవ విగ్ర హాలను ఊరేగింపుగా తీసుకొచ్చి, ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, జై శ్రీరామ్ అంటూ రథాన్ని ముందుకు లాగారు. రథాన్ని స్థానిక ఆలయం నుంచి గురుదేవా ఆశ్రమం వరకు లాగి, తిరిగి యథాస్థానానికి చేర్చారు. భక్తులు రథంపై పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు.



గూళ్యపాళ్యంలో సీతారాముల మూల విరాట్



ఉరవకొండ: బూదగవిలో అభయాంజనేయస్వామి రథోత్సవం

వైభవంగా వీరాంజనేయ స్వామి రథోత్సవం

ఉరవకొండ: మండలంలోని బూదగవి గ్రామంలో వెలసిన అభయాంజనేయస్వామి నూతన రథోత్సవం, సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా సోమవారం అభయాంజనేయ స్వామి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నూతన రథాన్ని విశేష పుష్పాలు, మామిడి తోరణాలతో అలంకరించారు. అనంతరం జై హనుమాన్ అంటూ భక్తులు రథాన్ని ముందుకు లాగారు.

మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలో రైతులు పండించిన మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆదుకోవాలని రాయదుర్గం రైతు రక్షణ వేదిక అధ్యక్షుడు, బీసీవై నియోజకవర్గ అధ్యక్షుడు గౌని ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా బ్యాడిగి, రెడ్‌మిర్చి పంటలుపెట్టి గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. కనీస మద్దతు ధర రూ.11,600 ఇవ్వాలని కోరారు.

పాస్టర్లకు నూతన వస్త్రాల పంపిణీ

గుమ్మఘట్ట: కలుగోడు గ్రామంలో జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్లకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ నెహెమ్యా మాట్లాడుతూ సేవకులు ఎలాంటి లక్షణాలు కలిగి ఉండాలి.. సంఘాలను ఎలా బలోపేతం చేసుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. సేవకులు జాన్‌పాల్, సురేష్, థామస్, ప్రసాద్, డేవిడ్, వరప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

కూడేరు: మండలంలోని కుష్టు రోగుల కాలనీ సమీపాన సోమవారం అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురానికి చెందిన మగ్బుల్ బాషా అనే యువకుడు గాయపడ్డాడు. ఉరవకొండలో సొంత పని చూసుకొని ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా గేదెలు అడ్డు రావడంతో తప్పించే క్రమంలో అదుపు తప్పి కింద పడ్డాడు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

శెట్టూరు: మండలంలోని మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు ఆధార్ క్యాంపులు ఉంటాయని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు శెట్టూరు ఉన్నత పాఠశాలలో, 10, 11 తేదీల్లో (గురువారం , శుక్రవారం) చింతర్లపల్లి గ్రామ సచివాలయంలో ఆధార్ క్యాంపులు ఉంటాయన్నారు. యాటకల్లు డిజిటల్ అసిస్టెంట్ కవిత ఆధ్వర్యంలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

కూడేరు: అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కొర్రకోడుకు చెందిన రైతు కురుబ వెంకటేష్ (45) సోమవారం రాత్రి మృతిచెందాడు. వెంకటేష్ అప్పుల బాధ తాళలేక ఆదివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.